కుష్టు వ్యాధికి కళ్లెం పడేనా!

- ప్రతి సంవత్సరం ఇంటింటి సర్వే
- ఏటా నమోదవుతున్న కొత్త కేసులు
- గతేడాది కొత్తగా 159 కేసుల నమోదు
- ఉచితంగా మందులు, ఉపకరణాల పంపిణీ
- నేడు జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవం


కుష్టు రోగుల గుర్తింపు సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


స్పర్శ కార్యక్రమ కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కుష్టు వ్యాధి ఒక భయంకర అంటువ్యాధిగా ఒకప్పుడు భావించేవారు. సదరు వ్యాధిగ్రస్తులను ఊరికి దూరంగా ఉంచేవారు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు చేస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల ఇప్పుడు వారు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరితో పాటు సాధారణ జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. తద్వారా అంగవైకల్యం రాకుండా చేసుకుంటున్నారు. ఈ మేరకు పదేళ్ల క్రితమే ఈ వ్యాధి అంతం కావాల్సింది. కానీ ప్రతి సంవత్సరం కొత్త కేసులు నమోదవుతూనే ఉండటం కలవరపాటుకు గురిచేస్తోంది. కుష్టు వ్యాధిగ్రస్తులకు మహాత్మాగాంధీ అందించిన సేవలకు గుర్తుగా ఆయన వర్ధంతి రోజును జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఈ వ్యాధి పరిస్థితిపై ప్రత్యేక కథనం.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఐదు సీహెచ్‌సీలు, ఒక బోధనాసుపత్రి, ఒక ఏరియా ఆసుపత్రి ఉన్నాయి. వీటి పరిధిలో 24,85,353 మంది జనాభా ఉన్నారు. గత సంవత్సరం జిల్లాలో ఆశ, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కొత్తగా 159 మందికి కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో పాత, కొత్త కేసులు కలిపి ఈ యేడాది 161 మంది చికిత్స పొందుతున్నారు. వీరిని ముందుగా పీహెచ్‌సీల్లోని మెడికల్ ఆఫీసర్ పరిశీలించి చికిత్స అందిస్తారు. ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయాలంటే మాత్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తున్నారు. ఇక్కడి ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, డీపీఎంటీలు వీరికి వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేటుగా కర్నూలు నగరం నందికొట్కూరు రోడ్డులోని మరియా నిలయంలో అనాథలైన కుష్టు వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

ప్రతి సంవత్సరం కొత్త కేసులు నమోదు

ప్రతి సంవత్సరం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో ఆశ, ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్తగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంతో పాటు కుష్టు వ్యాధి విస్తరించకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా ప్రతి సంవత్సరం కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జిల్లాలో 2018–19లో 531 కేసులు, 2019–20లో 506 కేసులు, 2020–21లో 136 కేసులు, 2021–22లో 191 కేసులు, 2022–23లో 188 కేసులు, 2023–24లో 278 కేసులతో పాటు గత సంవత్సరం 159 కేసులు కొత్తగా నమోదయ్యాయి. ప్రస్తుతం పాత కేసులతో కలిపి జిల్లాలో మొత్తం 161 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారు. జిల్లాలో ప్రతి 10 వేల మందిలో 0.65 శాతం మందికి ఈ వ్యాధి ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ప్రతి సంవత్సరం కొత్తగా లక్ష మంది జనాభాలో 6.39 శాతం కొత్త కేసులు రిజిస్టర్ అవుతున్నట్లు గుర్తించారు. ఈ లెక్కలను బట్టి జిల్లాలో కుష్టు వ్యాధి ఎప్పుడు అంతమవుతుందోనని వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బహుళ ఔషధ చికిత్స (మల్టీడ్రగ్ థెరపీ) ద్వారా కుష్టు వ్యాధికి మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ముందుగా వ్యాధిగ్రస్తున్ని వైద్యునిచే వ్యాధినిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండవ నెల నుంచి ఏఎన్‌ఎం ద్వారా ఇంటి వద్దే మందులు తీసుకోవచ్చు. వైద్యులు సూచించిన మేర నిర్ణీత కాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

కుష్టు వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రి అను బ్యాక్టీరియా వల్ల వస్తుంది.
- రోగి తుమ్మడం, దగ్గడం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్లు పడుతుంది.
- స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఛాతి, వీపుపై నొప్పిలేని బుడిపెలు, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, వాపులు ఉండటం, ముక్కుదూలం అణిగిపోయి గాలి ఆడకపోవడం, బొటనవేలు, చిటికెనవేలు, మణికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్లు నేలకు రాసుకోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



కుష్టు వ్యాధిపై అవగాహనలో భాగంగా జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు 15 రోజుల పాటు స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో, వార్డు సచివాలయాల్లో కుష్టు వ్యాధిపై ఎంఎల్‌హెచ్‌పీ/ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులచే గ్రామసభలు నిర్వహిస్తాం. ఈ సభల్లో కుష్టు వ్యాధిపై అవగాహన, ఎండీటీ ఉచిత చికిత్స గురించి వివరిస్తారు. కొత్త కేసులను గుర్తించడం, వారికి వెంటనే చికిత్స ప్రారంభించడం, వారి పట్ల వివక్ష, చిన్నచూపు చూడకుండా చేయడం, వారిలో అంగవైకల్యాన్ని తగ్గించడం, కొత్త కేసుల సంఖ్యను తగ్గించడం ఈ కార్య క్రమం ప్రధాన ఉద్దేశాలు. అంతేగాక జిల్లాలోని పాఠశాలలు, కాలేజీలు, డ్వాక్రా, పొదుపు సంఘాల సభ్యులకు, విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించనున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ), కర్నూలు

క్లుప్తంగా

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి


మైనార్టీ అఫైర్స్ ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లు పెట్టి కేంద్రానికి పంపేలా సీఎం చంద్రబాబునాయుడుపై ఒత్తిడి తేవాలని మైనార్టీ అఫైర్స్ రాష్ట్ర ప్ర భుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను ఆవాజ్ కమిటీ నాయకులు కోరారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఆయన్ను ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలోని బృందం కలిసి వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం మైనార్టీ ఆస్తులపై కన్నేసిందని, దాన్ని వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు వక్ఫ్ సరవణను వ్యతిరేకించాలని, అందులో భాగంగా టీడీపీ, జనసేలను ఒప్పించాలని కోరారు. అలాగే కర్నూలు నగర శివారులోని బీడీ వర్కర్స్ కాలనీవాసులకు ఒరిజినల్ ఇంటి పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని మరో వినతి పత్రం ఇచ్చారు.

జేఈఈ పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన


పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

కర్నూలు సిటీ: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్ అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రం వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి వివరాలు.. జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు ఈ నెల 22వ తేదీ నుంచి మొదలయ్యాయి. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్ అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రం వద్ద కొందరు వ్యక్తులు పరీక్షలకు హాజరయ్యేందుకు వచ్చిన విద్యార్థుల హాల్ టికెట్లు, ఆధార్ కార్డులను ఫోన్లలో ఫొటోలు తీసుకుంటున్నారు. ఈ విషయంపై పేరెంట్స్‌కు అనుమానం రావడంతో మీరు ఎవరు, విద్యార్థుల హాల్ టికెట్లు, ఆధార్‌కార్డులను ఎందుకు ఫొటో తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఐడీ కార్డులు చూపించాలని నిలదీయగా వారు పొంతన లేని మాటలు చెప్పడంతో కేంద్రం వద్దనే పేరెంట్స్ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విచారించారు. పరీక్ష కేంద్రం నిర్వాహకులు వచ్చి వారంతా తమ వాళ్లేనని చెప్పారు. ఐడీ కార్డులు చూపించమని కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో అప్పటివరకు తీసిన హాల్ టికెట్, ఆధార్‌కార్డుల ఫొటోలు డిలీట్ చేయాలని పేరెంట్స్ డిమాండ్ చేశారు. ఘటనపై పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

క్షుద్ర పూజలపై సమగ్ర విచారణ జరపాలి



మాట్లాడుతున్న శ్రావణి, భారతి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర శివారులోని బి.తాండ్రపాడు ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో క్షుద్ర పూజలు జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా, నగర కార్యదర్శులు శ్రావణి, భారతి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో చదువుతున్న బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడంతో కనీసం కాలేజీలోకి ఎవరు వచ్చి వెళ్తున్నారో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. నిద్రిస్తున్న బాలిక జుట్టును కత్తిరించడం, ఆమె చుట్టూ నిమ్మకాయలు కోసి ఉండడం, చంపేస్తామని లేఖ ఉన్నా తూతూమంత్రంగా విచారణ చేసి ముగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ఉండాలంటే పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. కార్యక్రమంలో నాగేంద్రమ్మ, పావని పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్‌కు సన్మానం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ సొంటి నాగరాజును జిల్లా ఓబీసీ చైర్మన్ సాంబశివుడు సన్మానించారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా, అసెంబ్లీ స్థాయిల ఓబీసీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన నాయకులతో కలసి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. జిల్లాలో ఓబీసీ విభాగాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించినట్లు సాంబశివుడు తెలిపారు.

ఆరె కటికలను ఎస్సీలో చేర్చాలి

కర్నూలు(అర్బన్): వెనుకబడిన కులాల్లో బీసీ–డీ (సీరియల్ నంబర్ – 2)లో నమోదైన ఆరెకటిక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరెకటిక ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.డి.కృష్ణోజీరావు, జి.శివాజీరావు కోరారు. వారు బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కులస్తులు కబేళాలకు పోయి పొట్టేలు మాంసం విక్రయిస్తూ కడు పేదరికంలో జీవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా జనాభా కలిగిన ఆరెకటికలు కుల వృత్తిని నమ్ముకుని తక్కువ సంపాదనతో పేదరికంలో మగ్గుతున్నారన్నారు. బీసీ–డిలో ఉన్న తమను ఎస్సీలో చేర్చేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపి న్యాయం చేయాలని కోరారు. అలాగే కబేళాలకు ఆధునికీకరించి కాంట్రాక్టు పద్ధతిలో తమకే ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ఆరె కటికలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. కుల వృత్తిపై ఆధారపడిన ఆరెకటికలకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ఇప్పటికే దేశంలోని మహారాష్ట్ర, హరియానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాంచల్ రాష్ట్రాల్లో ఆరెకటికలు ఎస్సీ జాబితాలో ఉన్నారని తెలిపారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దు

కర్నూలు (టౌన్): నగరంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ప్రజలను కోరారు. బుధవారం కొండారెడ్డి బురుజు సమీపంలోని పూలబజార్ వెనుక ప్రాంతంలో వ్యర్థాలను కమిషనర్ పరిశీలించారు. వ్యర్థాలను వెంటనే శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. అలాగే అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. అనంతరం ధర్మపేట, పాత ఎస్‌బీఐ బ్యాంకు కూడలి, కోట్ల సర్కిల్ ప్రాంతాలను కమిషనర్ తనిఖీ చేశారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య, తనిఖీదారులు మునిస్వామి, లోకేష్ పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం పుణ్యఫలం


శివస్వాములకు ఆహారం వడ్డిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): శివస్వాములకు అన్నదానం చేయడం పుణ్యఫలమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వినాయక ఘాట్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శివ మాలధారులకు పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. అనంతరం శివ భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. సుమారు 600 మంది శివస్వాములు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంతో నియమ, నిష్టతలతో ఉన్న స్వాములకు అన్నదానం చేయడం మంచి నిర్ణయమని, అక్కిమిని హనుమంతరెడ్డిని అభినందిస్తున్నట్లు కాటసాని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీలు పాటిల్ అనుమంతరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, యూత్‌వింగ్ అధ్యక్షుడు శివారెడ్డి, దిశ సభ్యుడు ఎరుకలరాజు, సునీల్, కాశీ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): నగరపాలక సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం ఉంటుందని, 12 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి 9 అజెండా అంశాలపై పాలకవర్గ సభ్యులు చర్చించనున్నట్లు తెలిపారు. నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలి


క్యాజువాలిటీ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల అక్రమంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని క్యాజువాలిటీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రితో పాటు కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీల్లో భద్రత కోసం అగ్రిమెంట్ దక్కించుకుని పనిచేస్తున్న ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారు ప్రారంభం నుంచి కొంత మంది సూపర్‌వైజర్ల ద్వారా సెక్యూరిటీ ఉద్యోగ రిక్రూట్‌మెంట్ పేరున లక్షల రూపాయలు వసూలు చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సెక్యూరిటీ గార్డులకు సరైన జీతం, ఈఎస్ఐ, పీఎఫ్‌లు, సక్రమంగా ఇవ్వకుండా వారిని మోసం చేశారన్నారు. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి డ్యూటీ నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదరు ఏజెన్సీ అక్రమాల గురించి ఆసుపత్రి అధికారులకు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినా కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ రామాంజనేయులు, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మైమూద్, నగర ఉపాధ్యక్షులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వైద్యపరీక్షలు తప్పనిసరి

– రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి


డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీసీ శాంతకుమారి

కర్నూలు: డ్రైవర్లు ఆరుమాసాలకోసారి కచ్చితంగా వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా వాహనాలను సురక్షితంగా గమ్యాలకు చేర్చగలుగుతారని రవాణా శాఖ కర్నూలు ఉప కమిషనర్ శాంతకుమారి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్‌టీఓ భరత్ చవాన్ పర్యవేక్షణలో బుధవారం జిల్లా గ్రంథాలయంలో డ్రైవర్లకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, మదర్ థెరిస్సా సొసైటీ సంస్థ ప్రెసిడెంట్ ఎల్.దొమణి, మెడికవర్ ఆసుపత్రి, శాంతిరాం కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి డీటీసీ శాంతకుమారి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ డ్రైవర్ల ఆరోగ్య స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని బీపీ, షుగర్, కంటి పరీక్షలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉంచుకోవాలని తెలిపారు. ఆర్‌టీఓ భరత్ చవాన్ మాట్లాడుతూ డ్రైవర్లు దురలవాట్లకు దూరంగా ఉండాలని, వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, పరధ్యానంలో ఉండటం తగదన్నారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవీంద్ర కుమార్, నాగరాజ నాయక్, సుధాకర్ రెడ్డి, ఏఎంవీఐలు బాబు కిషోర్, గణేష్ బాబు, వైద్య సిబ్బంది, లారీ, ఆటో యూనియన్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు (టౌన్): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ భవనంలో పర్యావరణం, నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ముందు తరాలకు మంచి జీవితాన్ని అందించిన వారమవుతామన్నారు. నీటి వనరుల సంరక్షణ, నీటి కాలుష్యం నివారణ గురించి వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. చెత్తను సకాలంలో సేకరించి నగరాన్ని పర్యావరణ హితంగా మారుస్తున్నట్లు చెప్పారు. భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్ రెడ్డి, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్, నారాయణ, ప్యానెల్ న్యాయవాదులు, యువ న్యాయవాదులు పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ నేతలు

కర్నూలు (అర్బన్): ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు నగరంలోని సంకల్ బాగ్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. 30న ఉదయం 8:30 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు, వేద పండితులు, పురోహితులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. ఉదయం గోపూజ, వినాయక పూజ, శ్రీవారి అభిషేకం అనంతరం లక్ష్మీ గణపతి హోమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భోజనాలు, సాయంత్రం 5:30 గంటలకు శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్యామ్‌సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, కోశాధికారి సీఎస్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ హెచ్‌ఓను కడపలోనే కొనసాగించాలి


ఎంపీ బస్తిపాటి నాగరాజుకు మెమోరాండం సమర్పిస్తున్న సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): అభివృద్ధి మొత్తాన్ని అమరావతిలోనే కేంద్రీకరించడం తగదని, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని (హెచ్‌ఓ) అమరావతికి తరలించకుండా కడపలోనే కొనసాగించే విధంగా తగిన చొరవ తీసుకోవాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. బుధవారం కర్నూలు ఎంపీని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మూడు గ్రామీణ బ్యాంకులు ఏపీజీబీలో విలీనం అవుతున్నాయని, ఇందువల్ల ఏపీజీబీ అతి పెద్ద బ్యాంకుగా అవతరిస్తోందని తెలిపారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం వివిధ బ్యాంకులు ఏ బ్యాంకులో విలీనం అయ్యాయో... ఆ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడుందో అక్కడే కొనసాగించాల్సి ఉందని వివరించారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాల్సి ఉండగా, అమరావతికి తరలించే ప్రయత్నం జరుగుతోందని ఎంపీకి వివరించారు. కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఏ గ్రామీణ బ్యాంకుకు లేని విధంగా కరెన్సీ చెస్ట్ ఉందని చెప్పారు. విలీనం తర్వాత ఏర్పడుతున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీకి మెమోరాండం సమర్పించారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. సమస్యపై ముఖ్యమంత్రితో చర్చిస్తామని పేర్కొన్నారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ప్రతినిధులు సిద్ధప్ప, హన్మంతురెడ్డి, సురేష్, రమణారెడ్డి, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాండ్ పోటీల్లో ప్రతిభ


పైప్ బ్యాండ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

కర్నూలు సిటీ: రిపబ్లిక్ డే సందర్భంగా సెంట్రల్ డిఫెన్స్, ఎడ్యుకేషన్ మినిస్టర్ సంయుక్తంగా కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీల్లో మాంటే ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు ప్రతిభ చాటింది. బాలుర పైప్ బ్యాండ్ జట్టు రెండవ స్థానంలో నిలిచి వెండి పతకం గెలుచుకుంది. ఆ తరువాత సౌత్ జోనల్ లెవల్ పోటీలు కర్ణాటకలోని ధావనగిరిలో జరగ్గా బాలికల పైప్ బ్యాండ్ జట్టు గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో జాతీయ పోటీల్లో 16 రాష్ట్రాల జట్లు పోటీ పడ్డగా ఇందులో 4వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అభినందించారు. స్కూల్ డైరెక్టర్ కె.ఎ.న్.వి రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాద పూర్వకంగా కలవడంతో ఆయన విద్యార్థులను అభినందించారు.

ఆయుష్మాన్ కాలేజీపై చర్యలు తీసుకోవాలి


డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా, ఫీజులు మాత్రమే వసూలు చేస్తున్న ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కన్వీనర్ కోటా సీటు అలాట్ అయినా తాజుద్దీన్ అనే విద్యార్థిని ఫీజులు కట్టాలని వేధిస్తున్నారని, ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ రాగానే మొత్తం ఫీజు చెల్లిస్తానని చెప్పినా వినకుండా అతన్ని ద్వితీయ సంవత్సరం పరీక్షలకు అనుమతించకుండా విద్యార్థి జీవితాన్ని నాశనం చేశారని ఆరోపించారు. బాధిత విద్యార్థికి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, నగర ఉపాధ్యక్షుడు అబూబకర్, మల్లేష్, ఆర్యన్, ఖాజా తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో రక్షణ


టీకాల గురించి అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఆయన బుధవారం స్థానిక గడ్డ వీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద పడఖానా సచివాలయం (20/21)లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలోని అర్హులైన గర్భిణులు, చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా ఎంఆర్ 1, ఎంఆర్ 2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఏఎన్ఎం ఏపీ హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ మాత్రలు, పిల్లలకు ఐరన్, విటమిన్ ఏ సిరప్‌లను పంపిణీ చేశారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, వైద్య సిబ్బంది లీలావతి, సువర్ణమ్మ, ఆశా కార్యకర్తలు పవిత్ర, సులోచనమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.